# బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో ప్రతిపక్షాల దిమ్మతిరిగింది



బీఆర్ఎస్ సమావేశంలో.. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్
- మాకు ఎవరూ పోటీ కాదు
- నెక్లెస్ రోడ్డులోని జలవిహార్‌లో సనత్‌నగర్ బీఆర్ఎస్ పార్టీ జనరల్ బాడీ సమావేశం

బేగంపేట్ అక్టోబర్ 16: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశ పెట్టిన బీఆర్ఎస్ మేనిఫెస్టోను చూసి ప్రతిపక్ష పార్టీల నాయకులకు దిమ్మతిరిగిపోయిందని సనత్‌నగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం నెక్లెస్ రోడ్డులోని జలవిహార్‌లో మంత్రి తలసాని అధ్యక్షతన సనత్‌నగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడిచిన తొమ్మిదిన్నర సంవత్సరాలలో తెలంగాణ ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచిన విషయాన్ని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఎకరాకు సాగునీరు, 24 గంటల విద్యుత్ సరఫరాను తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్నదని అన్నారు. రేషన్ ద్వారా పేదలకు సన్నబియ్యం ఇస్తామని ప్రకటించి ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని చెప్పారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణంతో పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనన్నారు. మరో లక్ష డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్న నాడు గ్యాస్ ధర పెంపును నిరసిస్తూ సిలిండర్‌కు దండం పెట్టి ఓటేసేందుకు పోయిన మోదీ నేడు గ్యాస్ ధలనకు 12వందలకు పైగా పెంచారని విమర్శించారు. పేదలపై ఆర్థిక బారాన్ని తగ్గించేందుకు 400 వందలకే సిలిండర్ ఇస్తామని ముఖ్యమంత్రి చెప్పారని అన్నారు. చెప్పింది చేసే సత్తా ఒక్క ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మాత్రమే ఉందన్నారు. ఇక్కడి నుంచి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికై కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి నాలుగున్నర ఏళ్లలో ఏంచేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి ఒక్క రూపాయి అభివృద్ధి పనులు ఏమన్నా చేశారా అని ప్రశ్నించారు. ఒక్క అవకాశం ఇవ్వాలని కోరుతున్న కాంగ్రెస్ పార్టీ అత్యధిక కాలం దేశం, రాష్ట్రాని పాలించి ప్రజలకు ఎం చేశారో చెప్పే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. తాము ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాల గురించి మాట్లాడుతామని ఎన్నికల తదనంతరం అభివృద్ధి ప్రజా సమస్యల పైనే దృష్టి సారిస్తామనేది అందరికి తెసునని చెప్పారు. ఏ సమస్య ఉన్న తమ వద్దకు వచ్చే వారికి పార్టీలకు అతీతంగా అవసరమైన సహకారాన్ని అందిస్తున్నామని చెప్పారు.

**మాకు ఎవరూ పోటీ కాదు ..**

సనత్‌నగర్ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీలో గెలుపు తథ్యమని సనత్‌నగర్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. నెక్లెస్ రోడ్డులోని జలవిహార్‌లో సోమవారం బీఆర్ఎస్ పార్టీ సమావేశం జరిగింది. ముందుగా ఆయన పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా పార్టీ నాయకులు కార్యకర్తలు వేదిక వరకు స్వాగతం పలికారు. ఈ సమావేశానికి నియోజకవ్గంలోని కార్పొరేటర్‌లు, మాజీ కార్పొరేటర్‌లు,డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వీరితో పాటు సిక్కు సమాజ్, గుజరాతి సమాజ్, క్రిష్టియన్, ముస్లిం, మైనార్టీ ప్రతినిధులు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు వివిధ బస్తీలు, కాలనీల అసోసియేషన్‌ల ప్రతినిధులు పాల్గొని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు సంపూర్ణ మద్దతును ప్రకటించారు. భారీ మెజార్టీలో గెలిచే విధంగా కృషి చేస్తామని ప్రకటించారు. ఈ సంధర్భంగా పలువురు మాట్లాడుతూ... సనత్‌నగర్ నియోజకవర్గంలో తలసాని శ్రీనివాస్‌యాదవ్ గెలుపు ఖాయమైందని అత్యధిక మెజార్టీ సాధించడం కోసమే కష్టపడాల్సి ఉందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ... ఈ నెల 19వ తేదీ నుంచి నియోజకవర్గంలో పాదయాత్రలను ప్రారంభించనున్నట్టు చెప్పారు.అదే విధంగా వచ్చే నెల 9వ తేదీన భారీ ర్యాలీతో నామినేషన్ దాఖలు చేయనున్నట్టు తెలిపారు. సనత్‌నగర్ నియోజకవర్గం మొత్తం నామినేషన్ ర్యాలీలో పాల్గొంటుందని తెలిపారు. సనత్‌నగర్‌లో 50 సంవత్సరాలలో జరగని అభివృద్ధి తొమ్మదిన్నర ఏండ్లలో చేశామని చెప్పారు. చేపట్టిన అభివృద్ధి పనులతోనే ప్రజల్లోకి వెళతామని అన్నారు. వందల కోట్లు ఖర్చు చేసి ఎన్నో అద్భుతాలు సృష్టించామని తెలిపారు. గతంలో గెలిచి ముఖ్యమంత్రిగా వ్యవహరించిన మర్రి చెన్నారెడ్డి కూడా చేయలేని అనేక అభివృద్ధి పనులు చేసినట్టు వివరించారు. సనత్‌నగర్‌లో ఇండ్లపై నుంచి వెలుతున్న హై టెన్షన్ విద్యుత్ తీగల వలన అనేక మంది ప్రాణాలను కోల్పోయారని అయినా సమస్యను పరిష్కరించలేక పోయారని అన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించినట్టు తెలిపారు. అదే విధంగా అల్లా ఉద్దీన్ కోటిలో ఎన్నో సంవత్సరాల నుంచి నివసిస్తున్న వారికి పట్టాలు ఇప్పించామని అన్నారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ఎవరికి ఏ అవసరం వచ్చినా తాము ఉన్నామని భరోసా కల్పించామని వివరించారు. తన గెలుపు శ్రమిస్తున్న ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని అన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్‌లు కొలన్ లక్ష్మి, టి మహేశ్వరి, హేమలతా, మాజీ కార్పొరేటర్‌లు శేషుకుమారి, ఉప్పల తరుణి, ఆకుల రూప, కిరణ్మయికిశోర్, నాయకులు పవన్‌కుమార్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీహరి, వెంకటేశంరాజు, హన్మంతరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సనత్‌నగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

## ఎన్నికల నియమావళిపై సమీక్ష సమావేశం




సనత్‌నగర్ నియోజకవర్గం ఎన్నికల సిబ్బందితో సమీక్షసమావేశం నిర్వహిస్తున్న రిటర్నింగ్ అధికారులు

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 16 : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో నిర్వహించాల్సిన ఎన్నికల నియమావళి గురించి సోమవారం జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యారలయంలో సమీక్షసమావేశం జరిగింది. సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి బి.కిషన్, సహాయ ఎన్నికల అధికారులు బేగంపేట్ డీసీ ఎన్.శంకర్, ఖైరతాబాద్ డీసీ జగన్, ఏసీపీలు క్రిస్టొఫర్, వి.కుమార్, పోలీస్ శాఖ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఎన్నికల నిర్వహణలో ముఖ్యమైన పోలింగ్ స్టేషన్ల సన్నద్ధం, ఓటరు జాబిత, అభ్యర్థుల వాహనాలకు అనుమతులు ఇవ్వడం, ఎన్నికల నియమావళి ఉల్లంఘించే వారిపై చేపట్టాల్సిన చర్యలు, పౌరుల నుండి వచ్చే ఫిర్యాదులపై ఎలా స్పందించాలని అనే అంశాలను రిటర్నింగ్ అధికారులు ఎన్నికల సిబ్బందికి వివరించారు.

## ఘనంగా బతుకమ్మ సంబురాలు..



సనత్‌నగర జెక్‌కాలనీలో బతుకమ్మ సంబురాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. వేడుకల మూడవ రోజు సోమవారం కాలనీలోని స్ట్రీట్ నంబర 3లోని వైష్ణవి సన్‌రైజ్ అపార్ట్‌మెంట్స్ ఎదుట బతుకమ్మ వేడుకలకు కాలనీ మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ వేడుకలు నిర్విఘ్నంగా కొనసాగుతుండడంలో బతుకమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చింతిరెడ్డి ప్రభ, ఎస్.అన్నపూర్ణలు విశేష చొరవ తీసుకుంటున్నారు. **– అమీర్‌పేట్, అక్టోబర్ 16**

## బీఆర్ఎస్ సర్కారు మళ్లీ రావాలని చండీ హోమం



రాబోయే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధించి, మరోసారి సర్కారు ఏర్పడాలని, సనత్‌నగర్ నియోజకవర్గంలో ప్రజా నాయకుడైన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ భారీ మెజారిటీతో గెలవాలని కోరుతూ అభిమానులు చండీ హోమం నిర్వహించారు. న్యూబోయిగూడలోని గొల్లకొమరయ్య కాలనీ ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌రావు, బీఆర్ఎస్ విధ్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనీశ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం బోయిగూడలోని మహంకాళి ఆలయంలో జరిగిన హోమం అనంతరం పేదలకు అన్నదానం నిర్వహించారు. **– బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 16**

## అనుమానాస్పదస్థితిలో వృద్ధురాలు మృతి

బేగంపేట్ అక్టోబర్ 16: ఒంటిపై గాయాలతో ఓ వృద్ధురాలు అనుమానాస్పద స్థితితో మృతి చెందింది. బేగంపేట్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆరీఫా బేగం(70)బేగంపేట్ పాటిగడ్డ సమీపంలోని కట్టెలమండి ప్రాంతంలో నివాస ముంటుంది. ఆమె మనవలు, మనమరాళ్లు కూడా అదే బస్తీలో ఉంటున్నారు. ఈనెల 13వ తేదీన సాయంత్రం సమీపంలో ఉంటున్న మనవడు మోసిన్ ఖాన్ ఇంటికి వెళ్లింది. కొద్ది సేపు అక్కడే ఉండి తిరిగి ఇంటికి వెళ్లింది. 14వ తేదీ తెల్లవారు జామున 3 గంటలకు మోసిన్‌ఖాన్‌కు ఆరిఫా బేగం మనవడుషేక్ సాబేర్ ఫోన్‌చేసి ఆరిఫా బేగం గదిలో పడిపోయి ఉందని చెప్పాడు. అందరు అక్కడికి వెళ్లి చూశారు. అపస్మారక స్థితిలో ఉన్న అమెను సమీపంలో కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వైద్య చికిత్స చేస్తుండగా సోమవారం ఉదయం మృతి చెందింది. కాగా మృతురాలి ముక్కువెంట రక్తం కారడం, చేతి వేళ్లలో వెంట్రుకలు కలనిపించాయి. దీంతో పాటు పెదవి పైన గాయాలు కూడా ఉన్నాయి. మనవడు షేక్ సాబేక్ కొంత అనుమానస్పందగా మాట్లాడటం ఇవన్నీ అనుమానస్పదంగా ఉన్నాయని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# వివిధ రూపాల్లో అమ్మవారు దర్శనం..

అమీర్‌పేట్/ బేగంపేట్ , అక్టోబర్ 16 : దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయాల్లో అమ్మవార్లు వివిధరూపాలోల భక్తులకు దర్శనమిస్తున్నారు. బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారు శ్రీ అన్నపూర్ణా దేవిగా, అమీర్‌పేట్ శ్రీ కనక దుర్గమ్మ అమ్మవారు శ్రీ బాలా త్రిపురసుందరిదేవిగా, సనత్‌నగర్ హనుమాన్ దేవాలయంలో కొలువుదీరిన దుర్గమ్మవారు శ్రీ గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వివిధ రూపాల్లో కొలువుదీరిన అమ్మవార్లను భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు.



గాయిత్రిదేవిగా.. ఉజ్జయిని మహంకాళి

**అమ్మవారికి స్వీట్లతో అలంకరణ..**

దసరా నవరాత్రుల అంలకరణల్లో భాగంగా సోమవారం బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారిని వివిధ రకాల స్వీట్లతో అలంకరించారు. అమీర్‌పేట్‌కు చెందిన విజయ స్వీట్స్ వారు అమ్మవారికి ఈ స్వీట్లను సమర్పించుకున్నారు.



వివిధరూపాల్లో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

**గాయిత్రి దేవిగా ఉజ్జయిని మహంకాళి అమ్మవారు..**

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల పురస్కరించుకోని సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి దేవాలయంలో దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అమ్మవారికి నిర్వహిస్తున్న విశేష పూజలతో ఆలయం భక్తులతో రద్దీగా మారింది. సోమవారం రోజున మహంకాళి అమ్మవారు శ్రీ గాయిత్రి దేవి అలంకరణలో భక్తులకు దర్శినమిచ్చారు.



వివిధ రకాల స్వీట్ల అలంకరణలో దర్శన మిచ్చిన బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారు